క్లుప్తంగా

బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ



బహుమతులు సాధించిన విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని నెరవాటి బ్యాడ్మింటన్ అకాడమీలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఆరవ తరగతి విద్యార్థి వాల్మీకి లోకేశ్వర్ ప్రతిభచాటి మొదటి స్థానం సాధించినట్లు నిర్వాహకులు డాక్టర్ లక్ష్మయ్య, శ్రీనివాస గుప్త, కోచ్ సాయినాథ్ రెడ్డి తెలిపారు. ప్రతిభచాటిన విద్యార్థులకు మొమెంటో, సర్టిఫికెట్లు, బహుమతులు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో విజేతలను డాక్టర్ వినోద్ కుమార్,రామయ్య అభినందించారు.

స్కై మార్షల్ ఆర్ట్స్‌లో ఏ గ్రేడ్ సర్టిఫికెట్



సర్టిఫికెట్ తీసుకుంటున్న నూర్‌బాషా

నంద్యాల(న్యూటౌన్): నేషనల్ స్కై మార్షల్ ఆర్ట్స్ రెఫరీ సెమినార్‌లో నంద్యాల జిల్లా మార్షలార్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి నూర్‌బాషా ఏ గ్రేడ్ సర్టిఫికెట్ సాధించినట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22, 23 తేదీల్లో నెల్లూరులోని స్కై ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన కోచింగ్ క్యాంప్, రెఫరీ సెమినార్‌లో అత్యంత ప్రతిభచాటడంతో తనకు ఏ-గ్రేడ్ సర్టిఫికెట్ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ సెమినార్‌లో 23 జిల్లాల నుంచి 40 మంది పాల్గొన్నారని, ఇందులో నంద్యాల జిల్లాకు ఏ-గ్రేడ్ బహుమతి ఇచ్చినట్లు వెల్లడించారు.

పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడికి సన్మానం



అధ్యక్షుడిని సన్మానిస్తున్న నాయకులు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లా పీఆర్‌టీయూ నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు ఎస్‌వీ భాస్కర్‌రెడ్డిని మంగళవారం స్థానిక కార్యాలయంలో ఘనంగా సన్మానం నిర్వహించారు. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారావు, రాష్ట్ర నాయకులు సుమయున్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న జడీపీఎఫ్ లోన్లు, సరెండర్ లీవులను వెంటనే విడుదల చేయాలని కోరారు. కొత్త పీఆర్‌సీని వేసి ఐఆర్ ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో దస్తగిరి, అబ్దుల్ కలాం, సుదర్శన్‌రెడ్డి, రహిమాన్, రమన యాదవ్, కరిముల్లా, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

26న ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని మునిసిపల్ హైస్కూల్ క్రీడా మైదానంలో ఈ నెల 26న ఉమ్మడి జిల్లాల బాల్ బ్యాడ్మింటన్, ఫెన్సింగ్, రోప్ స్కిప్పింగ్, షటిల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లాల కార్యదర్శులు వి. శివకుమార్, జీ. లక్ష్మయ్య మంగళవారం తెలిపారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ 2023-24 అండర్- 14, అండర్- 17 విభాగంలో జిల్లా స్థాయి ఎంపికలు ఉంటాయన్నారు. షటిల్ బాడ్మింటన్ పోటీలు బొమ్మల సత్రంలోని నంది పైప్స్ కంపెనీ లోని ఆడిటోరియంలో జరుగుతాయన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడాకారులను ఎంట్రీఫారంను, మిడ్‌డే మీల్స్ ఫారం తీసుకురావాలన్నారు. క్రీడాకారులకు భోజన వసతి ఏర్పాటు చేశామన్నారు. ఎంపిక పోటీలకు కర్నూలు, నంద్యాల డీఈఓలు రంగారెడ్డి, సుధాకర్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరవుతారని చెప్పారు.

బైక్ ప్రమాదంలో యువకుడి మృతి

ఆళ్లగడ్డ : పట్టణంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జాకీర్ (18) అనే యువకుడు మృత్యువాత పడ్డాడు. పట్టణంలోని కొత్తమసీదు వీధికి చెందిన జాకీర్ తన సొంత బైకుపై పట్టణంలో వెళ్తుండగా ఎదురుగా మరో బైకు రావడంతో సడన్‌గా బ్రేకు వేశాడు. అంతలో వెనుక వైపు నుంచి వస్తున్న మరో బైకు జాకీర్ బైకును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ జాకీర్‌ను స్థానిక వైద్యశాలకు తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో నంద్యాల వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. మృతుడి తండ్రి జిలానీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటరెడ్డి తెలిపారు.

కబడ్డీ విజేత శ్రీనగరం

మహానంది: తిమ్మాపురంలోని శ్రీ అంకాళ పరమేశ్వరీదేవి ఆలయం వద్ద నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో మహానంది మండలం శ్రీనగరం జట్టు ప్రథమస్థానంలో నిలిచినట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. రెండో స్థానంలో అయ్యకొండ జట్టు, మూడోస్థానంలో తిమ్మాపురం, నాలుగోస్థానంలో గీతా మాధురి జట్టు నిలిచాయి. వీరికి వరుసగా రూ. 20వేలు, రూ. 15వేలు, రూ. 10వేలు, రూ. 5వేలు నగదు బహుమతులు అందించారు.



నంద్యాలలో శమీవృక్షాన్ని దర్శించుకుంటున్న భక్తులు.



పసురపాడులో అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు.



సామూహిక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



ఉయ్యాలవాడలో శమీ వృక్షం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

వైభవంగా దసరా వేడుకలు

- అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ, గ్రామోత్సవం
- శమీ వృక్షాన్ని దర్శించుకున్న భక్తులు



చాగలమర్రిలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు.



శిరివెళ్లలో శమీ పూజకు బయలు దేరిన స్వామి



రామాలయంలో దశావతార అలంకారంలో వెంకటేశ్వరస్వామి



నంద్యాలలో ప్రత్యేక అలంకారంలో శ్రీకాళికాంబదేవి



ఆళ్లగడ్డలో దుర్గాదేవిగా వాసవీమాత

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో దసరా శరన్నవరాత్రులతో పాటు దశమి తిథి, శ్రవణా నక్షత్రం రావడంతో సోమవారం విజయదశమి పండుగను భక్తులు వైభవంగా నిర్వహించుకున్నారు. పండుగ రోజు ఉదయమే పలు దేవాలయాల్లో అమ్మవార్లను పుష్పాలంకరణతో ఉంచారు. స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించి స్వామి, అమ్మవార్లను ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. లలితా సహస్ర నామామం, విష్ణు సహస్రనామం, వేదపారాయణం, చండీ హోమం నిర్వహించి పూర్ణాహుతి గావించారు. పలు దేవాలయాల్లో సాయంత్రం శమీ దర్శనం కోసం భక్తులకు ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. విజయదశమి రోజున శమీ వృక్షం నందు అమ్మవారు కొలువై ఉంటుందనే నమ్మకంతో భక్తులు సాయంత్రం శమీ వృక్షాన్ని దర్శించుకున్నారు. జమ్మి పత్రాలను పిల్లలు పెద్దలకు ఇచ్చి ఆశీర్వాదాలు పొందారు. ఒకరినొకరు ఇచ్చిపుచ్చుకొని దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

పట్టణంలోని మెయిన్‌బజార్‌లోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిని వజ్రాల చీరతో అలంకరించారు. స్థానిక బైటిపేట ఆంజనేయస్వామి దేవస్థానానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. సాయంత్రం పట్టణంలోని అమ్మవారిశాల పీటం, కాళికాంబదేవి పీటం, శ్రీ కామేశ్వరిదేవి సహిత మహానందీశ్వర్లు, బ్రహ్మానందీశ్వరుల పీటం, జగజ్జననీ దేవాలయాల, శ్రీకాశిరెడ్డినాయన ఆశ్రమం పీటాలు దేవాలయాలకు సంబంధించిన పీఠాలు ప్రత్యేక అలంకారంలో గ్రామోత్సవం నిర్వహించారు. శ్రీకామేశ్వరిదేవి సహిత మహానందీశ్వరస్వామి మంగళవారం ఉదయం శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహించుకొని మహానందికి బయల్దేరారు.

ముగిసిన నవరాత్రి ఉత్సవాలు

ఆళ్లగడ్డ : గత పది రోజులుగా నియోజవర్గంలోని అమ్మవారి ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో వైభవోపేతంగా జరిగిన దసరా మహోత్సవాలు విజయ దశిమిని పురస్కరించుకుని మంగళవారంతో వైభవోపేతంగా ముగిశాయి. శరన్నవరాత్రుల మహోత్సవాల్లో భాగంగా ఆయా ఆలయాల కమిటీల ఆధ్వర్యంలో ఆలయాల్లో కొలువైన అమ్మవారిని కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు రోజుకో విదంగా విశేషంగా అలంకరించి భక్తుల దర్శనార్థం కొలువు ఉంచారు. చివరి రోజైన విజయదశిమి సందర్భంగా మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు పట్టణంలోని అమ్మవారిశాలలో కొలువైన శ్రీ వాసవీ దేవి అమ్మవారికి వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు.

రుద్రవరం: దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా కన్యకాపరమేశ్వరి అమ్మవారు భక్తులకు విజలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తుల దర్శనం అనంతరం అమ్మవారిని మంగళవారం గ్రామోత్సవం నిర్వహించారు.

ఉయ్యాలవాడ : దసరా ఉత్సవాలు మండలంలో సోమవారం శాస్త్రోక్తంగా ముగిశాయి. ఉయ్యాలవాడలో అగస్త్యేశ్వర, కోదండ రామాలయం, రామలయం ఆలయాల్లో వెలిసిన సీతారాములు, శివపార్వతులను ఉత్సవమూర్తులను ప్రత్యేక పల్లకీలో కొలువులో వుంచి గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం భక్తులు షమీ వృక్షాన్ని దర్శించుకున్నారు. జమ్మి పత్రాలను పిల్లలు పెద్దలకు, పండితులకు ఇచ్చి ఆశీర్వాదములు పొందారు.

దొర్నిపాడు: మండలంలో దసరా శరన్నవరాత్రులు వైభవంగా ముగిశాయి. గత తొమ్మిదిరోజులుగా అమ్మవారిని వివిధ అలంకారాలతో అలంకరించిన ఆర్యవైశ్యులు మంగళవారం అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు.

శిరివెళ్ల: దేవీ శరన్నరవరాత్రులు సోమవారం నాడు ముగిశాయి. ఈ సందర్భంగా దసరా పండుగ రోజున స్వామి వారు శమీ పూజలకు జమ్మిచెట్టుకు బయలు దేరారు. భక్తులకు జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు చేసి తమకు విజయం చేకూర్చాలని పూజలు చేశారు. రాత్రికి స్వామి వారికి గ్రామోత్సవాలు జరిగాయి. మంగళవారం వసంతోత్సవాలు జరిగాయి.



రుద్రవరంలో విజయలక్ష్మి దేవిగా అమ్మవారు

గోస్పాడు: దసరా పండుగను పురస్కరించుకుని మండల పరిధిలోని గ్రామాల్లో ప్రజలు భక్తి శ్రద్ధలతో పండుగ వేడుకలను సోమ, మంగళ వారాల్లో నిర్వహించారు. గోస్పాడు, పసురుపాడు గ్రామాల్లో అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేసి 9 రోజులపాటు నవరాత్రుల కార్యక్రమాలను చేపట్టారు. మంగళవారం పసురుపాడులో ఏర్పాటు చేసిన లలితా దేవి అమ్మవారికి గ్రామస్తులు బోనాలు సమర్పించారు.

వైభవంగా వసంతోత్సవం

చాగలమర్రి: మండల కేంద్రమైన చాగలమర్రి, ముత్యాలపాడు గ్రామాలలో గత 9 రోజులపాటు నిర్వహించిన దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు మంగళవారం వసంతోత్సవ కార్యక్రమంతో ముగిశాయి. శ్రీకన్యకాపరమేశ్వరిదేవిని పల్లకీలో కొలువుంచి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రంగులు చల్లుకుంటూ గ్రామోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో చాగలమర్రి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు లక్ష్మణబాబు, ముత్యాలపాడు ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు ముడియం నరసింహారావు, క్రిష్ణమూర్తి, కార్యదర్శి బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు. ముత్యాలపాడులో సోమవారం ఉదయం అమ్మవారిని శ్రీధనలక్ష్మీదేవి, సాయంత్రం శ్రీవిజయలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

గోవిందా.. గోవిందా

- శాస్త్రోక్తంగా శమీ వృక్ష మహోత్సవం
- అహోబిలంలో ముగిసిన దసరా మహోత్సవాలు



ఆయుధ పూజలో భాగంగా విల్లంబులు వదులుతున్న అర్చకులు

ఆళ్లగడ్డ : ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలంలో దేవి శరవన్నవరాత్రి మహోత్సవాలు మంగళవారం వైభవంగా ముగిశాయి. ఉదయం దిగువ అహోబిలం దేవాలయ ప్రాంగణంలోని యాగశాలలో ఉత్సవ మూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరద స్వాములను కొలువుంచి సుప్రభాత సేవతో పూజలు మొదలు పెట్టి ప్రత్యేక విజయదశిమి పూజా కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఉత్సవ మూర్తులకు నవకళశ పంచామృతాభిషేకం, తిరుమంజనం నిర్వహించి నూతన పట్టువస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం ఉత్సవమూర్తులకు విశేష ఆభరణాలు ధరింపజేసి, విశేష పుష్పాలంకరణ గావించి ఊయలలో విడివిడిగా కొలువుంచి మహాహవీర్ నివేదన, లక్ష కుంభహారతి నీరాజనములు సమర్పించి దివ్యప్రభంద పారాయణములు నిర్వహించారు.

శాస్త్రోక్తంగా శమీ మహోత్సవం

శరన్నవరాత్రి మహోత్సవాల్లో చివరిరోజైన విజయ దశిమి రోజు నిర్వహించే శమీ వృక్ష మహోత్సవానికి ప్రత్యేకస్థానం. ఇందులో భాగంగా దిగువన రాత్రి ఉభయ దేవేరులతో శ్రీ ప్రహ్లాదవరద స్వామి విశేష పష్పాలంకరణలో ఉత్సవ పల్లకీలో మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్చారణలో నడుమ గ్రామ శివారులోని జమ్మి చెట్టు వద్దకు చేరకున్నాడు. అక్కడ సంప్రదాయ ప్రకారం ఆయుధ పూజ నిర్వహించిన అనంతరం స్వామి వారి తరుపున అర్చకులు విల్లంబులను వదిలి సంబరాలు జరుపుకున్నారు. నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా వనమహోత్సవం నిర్వహించారు.

వరుణుడు కరుణించాలని..



ఉయ్యాలవాడలో బోనాలతో తరలివెళ్తున్న మహిళలు

ఉయ్యాలవాడ : వరుణ దేవుడి కరుణా కటాక్షాల కోసం మండలంలోని మాయలూరు, ఆర్.పాంపల్లె, పడిగెపాడు, పెద్దయమ్మనూరు, ఉయ్యాలవాడ గ్రామాల్లో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో శక్తి దేవతలైన పెద్దమ్మ, గంగమ్మ అమ్మవార్లకు గ్రామస్తులు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. రబీసీజన్ ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు భూమి పదునెక్కేంత వర్షం కురవలేదు. కొందరు రైతులు అదును దాటిపోతోందన్న ఆలోచనలతో వట్టి వుసిలోనే పప్పు శనగ విత్తనం వేశారు. మండల పరిధిలోని కొన్ని గ్రామాల్లో విత్తనం గొర్రు భూమిలో ఇంత వరకు దించలేదు. తేమ శాతం లేకపోవడంతో విత్తనం వేసినా మొలక రాదన్న భయంతో సాగు చేయలేదు. ఖరీఫ్ సీజన్‌లో అరకొరగా సాగు చేసిన పత్తి, మినుము, మిరప, కంది, తదితర పంటలు ఎండుదశకు చేరుకున్నాయి. వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని పై గ్రామాలప్రజలు గంగమ్మకు బోనాలు నైవేద్యంగా సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అలరించిన దసరా వేషాలు



ఉప్పరి పేటలో దసరా వేశాలు ప్రదర్శిస్తున్న కళాకారులు

నంద్యాల(వ్యవసాయం): దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకొని పట్టణంలో సోమవారం నిర్వహించిన దసరా వేషాల పోటీలు పలువురిని ఆకట్టుకున్నాయి. ప్రతి ఏడాది ఆనవాయితీగా భద్రకాళి, శక్తి, మహిషాసురుడు, శివుడు, నాగకన్యలు, దున్నపోతు, రక్తబీజుడు తదితర వేషాల అలంకారంలో తప్పెట్ల మధ్య ఒక్కొక్క వేషం అమ్మవారిని కీర్తిస్తూ.. చెడుపై విజయం సాధిస్తూ అమ్మవార్లు రాక్షసులను వధించే సన్నివేషాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సంవత్సరం స్థానిక బైటిపేట, ఉప్పరిపేట, దేవనగర్, పీవీనగర్, గుడిపాటి గడ్డ, యువకులు గ్రూపులుగా దసరా వేషాలు వేసి ప్రత్యేకను చాటుకున్నారు. దసరా వేశాల కల అంతరించి పోకుండా మరలా పునరుజ్జీవనం కల్పించేలా నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి స్థానిక టౌన్‌హాల్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా దసరా వేశాల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతిగా బాబు గ్రూప్ రూ. 50 వేలు, ద్వితీయ బహుమతి సనా గ్రూప్ రూ.30 వేలు, తృతీయ బహుమతి సురేష్ గ్రూప్ రూ.20 వేలు గెలుచుకున్నాయి. గుడిపాటి గడ్డలో కౌన్సిలర్ దండె లక్ష్మిదేవి, సుధాకర్, దేవనగర్‌లో దిలీప్, అదేవిధంగా పట్టణంలో పలుచోట్ల పోటీలు ఏర్పాటు చేసి వేశాలు ప్రదర్శించిన కళాకారులకు బహుమతులు అందజేశారు.

ఆర్ట్ గెలాక్సీ అవార్డుకు కోటేష్ ఆర్ట్ అకాడమీ ఎంపిక

నంద్యాల(అర్బన్): ఆర్ట్ గెలాక్సీ అవార్డుకు కోటేష్ ఆర్ట్ అకాడమీ సంస్థ ఎంపికైనట్లు ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ మంగళవారం తెలిపారు. ఒంగోలుకు చెందిన సృష్టి ఆర్ట్ అకాడమీ నిర్వాహకులు శేస బ్రహ్మం, రవీంద్రలు కోటేష్ ఆర్ట్ అకాడమీ సంస్థ చిత్రకళ సేవలను గుర్తించి అవార్డుకు ఎంపిక చేశారన్నారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాటాలడుతూ ఈ నెల 29న ఒంగోలు లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో ప్రముఖుల చేత అవార్డు ప్రదనం చేయనునన్నారన్నారు. కోటేష్ ఆర్ట్ అకాడమీ విద్యార్థులు చిత్ర కలలో రాణిస్తు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు, రివార్డులు సాధించారన్నారు.

భక్తిశ్రద్ధలతో దుర్గాదేవి నిమజ్జనం



నిమజ్జనానికి తరలి వెళ్తున్న దుర్గాదేవి

నంద్యాల(వ్యవసాయం): దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకుని పట్టణంలోని వివిధ ఆలయాల్లో ఏర్పాటు చేసిన శ్రీదుర్గాదేవి విగ్రహాలను మంగళవారం భక్తిశ్రద్ధలతో స్థానిక చిన్నచెరువు కట్ట వద్ద గల వినాయక ఘాట్‌లో నిమజ్జనం చేశారు. పదో రోజు దశమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చి, తీర్థ ప్రసాదాలను భక్తులకు వితరణ చేశారు. అనంతరం ట్రాక్టర్లపై అమ్మవారిని మేళతాలతో గ్రామోత్సవం నిర్వహించి వినాయక ఘాట్‌లో నిమజ్జనం చేశారు.

ఫుట్‌బాల్ విజేత చాగలమర్రి జట్టు



విజేతగా నిలిచిన జట్టుతో నిర్వాహకులు.

చాగలమర్రి: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో విజయదశమి పండుగ సందర్భంగా నిర్వహించిన రాయలసీమ స్థాయి ఫుట్‌బాల్ పోటీలలో చాగలమర్రి జట్టు విజేతగా నిలిచింది. పోటీలలో వైఎస్సార్, నంద్యాల జిల్లాలకు చెందిన 6 జట్లు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. ఫైనల్స్‌లో కడప జట్టుపై చాగలమర్రి జట్టు 1-0 గోల్స్ సాధించి విజేతగా నిలిచింది. ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు దాత ఎం.బి ఎలక్ట్రానిక్స్ యజమాని ఇర్షాద్ రూ.5,000ల నగదు, ట్రోఫీని, ద్వితీయ స్థానంలో నిలిచిన కడప జట్టుకు దాత రియాజ్ రూ.2,000ల నగదును బహుమతిగా అందజేశారు. పీడీ దాదా పీర్, నిర్వాహకులు కార్యదర్శి స్వర్ణకుమార్, మోచర్ల నరసింహ, సునీల్, మన్సూర్, పక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

నంద్యాల(న్యూ టౌన్): పట్టణంలోని ఎస్పీజీ ఉన్నత పాఠశాలలో మంగళవారం 1998-99 విద్యా సంవత్సరంలో 10 వతరగతి చదివిన పూర్వ విద్యార్థులు గురువులతో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఆనాటి మధుర స్మృతులను గుర్తుకు తెచ్చుకుని సంతోషపడ్డారు. తమకు చదువు చెప్పిన గురువులను సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. పూర్వ విద్యార్థుల సేవలను ధానోపాధ్యాయులు జీవలత కొనియాడారు. కార్యక్రమంలో ఆనాటి ఉపాధ్యాయులు సాగర్, మార్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో భక్తజన సందడి



మహానందీశ్వరుడి దర్శనార్థం వేచి ఉన్న భక్తులు

మహానంది: మహానంది ఆలయంలో మంగళవారం భక్తులసందడి నెలకొంది. దసరా సెలవులు కావడంతో రెండు తెలుగురాష్ట్రాలతో పాటు తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటకల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. భక్తులరాకతో ఆలయ ప్రాంగణాలు కళకళలాడాయి. ఆలయానికి చేరుకున్న భక్తులు రుద్రగుండం, చిన్నకోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. ఉదయం నుంచి ప్రారంభమైన స్వామి,అమ్మవారి దర్శనం రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగింది. ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.

దూదేకుల సింహగర్జనను విజయవంతం చేయండి

గడివేముల: గుంటూరులోని ఆంధ్రముస్లిం కాలేజీలో ఈ నెల 29న నిర్వహించే దూదేకుల సింహగర్జనను విజయవంతం చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు జమాల్‌బాషా, కరిమద్దెల మాజీ సర్పంచ్ దాలుస్వామి కోరారు. ఈ మేరకు మంగళవారం మండల పరిధిలోని పెసరవాయి, కరిమద్దెల, మంచాలకట్ట, గడివేముల గ్రామాల్లో దూదేకుల సోదరలను కలిసి కరపత్రాలను అందజేశారు. వారు మాట్లాడుతూ నేటికీ దూదేకుల సామాజిక వర్గాలు అన్నిరంగాల్లో వెనుకపడి ఉన్నారని, హక్కుల సాధనకు ఐకమత్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు యాసిన్‌బాషా, ఎక్స్‌ఆర్మీ జమాల్ పాల్గొన్నారు.

గుడిసె దగ్ధం

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంటలోని ఖాదర్‌హోటల్ సమీపంలో నివసిస్తున్న బీబీ గుడిసె మంగళవారం షార్ట్ సూర్క్యూట్ కారణంగా దగ్ధమయ్యింది. ఇంట్లో ఉన్న గృహోపకరణాలు కాలిపోయాయి. సుమారు రూ.70 వేల విలువగల వస్తువులు బూడిదపాలైనట్లు బీబీ తెలిపారు. ఫైర్‌సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు.

సహకార సంఘాల్లో ఆన్‌లైన్ సేవలు

శిరివెళ్ల: వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘాలలో త్వరలో ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి రానున్నాయని కేడీసీసీ బ్రాంచి మేనేజర్ రేణుక మంగళవారం తెలిపారు. ప్రస్తుతం సంఘాలలో ప్రక్రియ మొదలయిందని, రికార్డుల పారదర్శకత కోసం ఆన్‌లైన్ చేయడం ప్రారంభించామన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో ప్రతి సంఘంకు రూ. కోటి పంట రుణాలు మంజూరు కాగా 75 శాతం పంపిణీ జరిగిందన్నారు. ఈ ఏడాది సెప్టంబర్‌లో ప్రవేశ పెట్టిన జాబిల్లి డిపాజిట్ పథకం ద్వారా బ్రాంచి రూ. 25 లక్షలు డిపాజిట్‌ను సేకరించామన్నారు.

యూనివర్సిటీ పాలక మండలి సభ్యురాలిగా శైలజా రాణి

నంద్యాల(న్యూటౌన్): రాయలసీమ యూనివర్సిటీ పాలకమండలి సభ్యులను నియమిస్తు రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత విద్యా శాఖ ప్రధాన కార్యదర్శి శ్యామలా రావు ఉత్తర్వులు జారీ చేశారు. పాలక మండలి సభ్యులుగా నంద్యాల ప్రభుత్వ డిగ్రీకళాశాల బోటనీ లెక్చరర్ డాక్టర్ శైలజా రాణిని నియమించినట్లు నంద్యాల ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శశికళ మంగళ వారం తెలిపారు. పాలక మండలి సభ్యులుగా నియామకమైనవారు మూడేళ్ల పాటు కొనసాగుతారని తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని శవం

నందికొట్కూరు: గుర్తు తెలియని వ్యక్తి బస్టాండ్ సమీపంలో మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాల మేరకు పట్టణంలో భిక్షాటన చేసే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి వయస్సు సుమారు 65 ఏళ్లలోపు ఉంటుంది. అనాథ శవానికి పోలీసుల ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఆనవాలు గుర్తించిన వారు పట్టణ పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల- ఆళ్లగడ్డ ఆర్‌అండ్‌బీ రహదారిలో మండలంలోని కంపమల్ల మెట్ట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. మంగళవారం ఎస్ఐ మౌలానీ అందించిన సమచారం మేరకు ఆళ్లగడ్డ మండలం ఓబుళంపల్లె గ్రామానికి చెందిన మహేశ్వరరెడ్డి(28) కోవెలకుంట్ల మండలం కంపమల్ల గ్రామంలో ఉన్న అక్క రమాదేవి, బావను దసరా పండుగకు పిలుచుకెళ్లేందుకు వచ్చాడు. సోమవారం సోదరి, బావ ఒకబైక్‌పై, మహేశ్వరరెడ్డి మరో బైక్‌పై స్వగ్రామానికి బయలు దేరారు. కంపమల్ల మెట్ట వద్ద ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక మంగళవారం మృతి చెందినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మృతుని సోదరి రమాదేవి ఫిర్యాదు మేరకు బస్ డ్రైవర్ వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

మహానంది దేవస్థానం ఉద్యోగి మృతి

మహానంది: మహానంది దేవస్థానంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న డీపీ శివకుమార్(31) మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఇంటి వద్ద ఉండగా గుండెనొప్పి అంటూ చెప్పారని, చికిత్స నిమిత్తం నంద్యాల ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలోనే ప్రాణాలు విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతి చెందిన శివకుమార్‌కు భార్య శిరీష, ఇద్దరు కుమారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ట్రస్ట్‌బోర్డు మెంబర్ గంగిశెట్టి మల్లికార్జున, సూపరింటెండెంట్ ఓంకారం వెంకటేశ్వరుడు, ఇన్‌స్పెక్టర్ నాగభూషణం, హరినాథ్, అర్చకులు రాఘవశర్మ తదితరులు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం దేవస్థానం ఆధ్వర్యంలో రూ. 15వేలు నగదు అందించారు.